క్లుప్తంగా

ఎంపీడీఓలు బాధ్యతల స్వీకరణ

ఖమ్మంరూరల్: రూరల్ ఎంపీడీఓగా బి.రవీందర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కూసుమంచిలో రమాదేవి..

కూసుమంచి: కూసుమంచి ఎంపీడీఓగా ఆర్.రమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను సిబ్బందితో పాటు గ్రామ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

తిరుమలాయపాలెంలో శ్రీనివాసరావు..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఎంపీడీఓగా చుంచు శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం సిబ్బందితో మాట్లాడి మండల పరిస్థితులను, అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకున్నారు.

కేన్సర్‌పై భయం వద్దు..

ఖమ్మం మామిళ్లగూడెం: కేన్సర్‌కు భయపడొద్దని, ఏ రకమైన బ్లడ్ కేన్సర్‌కు అయిన వైద్యం అందించనున్నట్లు హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆస్పత్రి డాక్టర్ గణేష్ సత్వార్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతోకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన నాగేశ్వరరావుకు పూర్తిగా కేన్సర్ నుంచి విముక్తి కలిగించినట్లు తెలిపారు. ఇప్పటికే యశోద హాస్పిటల్‌లో వేల మంది బ్లడ్ కేన్సర్ రోగులకు వైద్యం చేసి విజయం సాధించామన్నారు.

శ్రీ చైతన్యలో హరితభారత్



విజేతలతో కార్పొరేటర్, ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ముస్తఫానగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం హరిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడపు లక్ష్మి పాల్గొని మొక్కల ఆవశ్యకతను వివరించారు.ఆతర్వాత చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలను సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, ఇటీవల జరిగిన నాసా పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 19 మంది పాల్గొనగా, వీరిలో మోక్షిత్, వినయ్‌కుమార్, చంద్రవర్ధన్, ధనుష్, చరణ్, వినయ్, వరుణ్, శరన్‌తేజ్, శ్రీరాంచరణ్, ఉదయ్, కార్తీక్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కార్పొరేటర్ లక్ష్మి అభినందించారు. ఈకార్యక్రమాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీజీఎం చేతన్‌తో పాటు జయప్రకాష్, శ్రీదేవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గులు, షూ అందజేత

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు శుక్రవారం రగ్గులు, స్పోర్ట్స్ షూను వసతి గృహం సంక్షేమాధికారి ఆర్.ఓదెలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

కందాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు..

మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు కందాల ఫౌండేషన్ ద్వారా ప్లేట్లు, గ్లాసులను ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ పంపిణీ చేశారు. జిల్లా ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శాం ఎమ్మెల్యే కుమార్తె దీప్తి, మనవడు ప్రియాన్స్ బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్‌కు చెందిన ఆటోడ్రైవర్ షేక్ జాఫర్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా ఈమేరకు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించి పువ్వాడ ఫౌండేషన్ తరఫున బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, ఇటీవల మృతి చెందిన 8వ డివిజన్ గొల్లగూడెంకు రెవెన్యూ ఉద్యోగి చిర్రా వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, కూరాకుల వలరాజు, నాయకులు సీహెచ్.రవికిరణ్, కృష్ణ, సలీం, బాలకృష్ణ, కె.రామకృష్ణ, సుధాకర్, కోటి, జానీ, కొండల్‌రావు, రజీం, బి.రామారావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	మెగ్ 2
సాయిరాం	హెబ్బులి, బ్రో
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	ఎల్‌జీఎం

– ఖమ్మం గాంధీచౌక్

సమ్మె సెగ..

పంచాయతీ కార్మికుల సమ్మెతో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- వీధుల్లో గుట్టలుగా చెత్తాచెదారం
- దినసరి కూలీల పనులతో పెనుభారం



వీవీపాలెంలో పనులు చేస్తున్న రోజువారి కూలీలు



నేలకొండపల్లిలో కుప్పగా ఉన్న చెత్తా చెదారం

రఘునాథపాలెం/నేలకొండపల్లి: గ్రామపంచాయతీల్లో పని చేసే కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నెల రోజులుగా సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరించే వారు లేక ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. వానాకాలం ప్రారంభం కావటంతో సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం 2020లో గ్రామాల్లో జనాభా దామాషా ప్రకారం ఒక్కో పంచాయతీలో ఇద్దరు నుంచి నలుగురు చొప్పున కార్మికులను నియమించింది. వీరు రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చెత్త తొలగించటంతో పాటు ఇతర పనులు చేస్తుంటారు. కార్మికులు సమ్మెలోకి వెళ్లటంతో మురుగు కాలువలు శుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ హరితహారంలో మొక్కలకు నీళ్లు పోయటం తదితర పనులన్నీ నిలిచిపోయాయి. సమ్మె ఇలాగే కొనసాగితే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

భారీగానే ఆర్థికభారం..

పంచాయతీల్లో పాలకవర్గాల సమయం సమీపిస్తుండటంతో కొన్ని పంచాయతీల్లో పాలకవర్గం సమస్యలపై అంటిముట్టనట్లుగా వ్యవహరించడంతో ఆ భారం మొత్తం అధికారులపై పడుతోంది. ప్రజలను, అధికారుల నుండి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో గ్రామ కార్యదర్శులు అడ్డాల్లోని కూలీలను రోజు వారి కూలీలకు తీసుకొచ్చి పనులు చేయించడం కత్తిమీద సాముగా మారింది. ఇందులో తాగు నీటి సరఫరా, విద్యుత్‌లైన్లు పనులు, ట్రాక్టర్ డ్రైవింగ్ ఉన్న కార్మికులు తీసుకురావడం అత్యధిక రేటు డిమాండ్ చేయడంతో ప్రైవేటు కార్మికులను తీసుకురావడంతో పంచాయతీలపై ఆర్థిక భారం కూడా భారీగానే పెరుగుతోంది. ఇటీవల రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడులో చెత్త ట్రాక్టరును నడపటానికి ఒక డ్రైవర్‌ను తీసుకోస్తే ఆ డ్రైవర్ మద్యం సేవించి నడపడంతో ఓ వార్డు మెంబర్ ఇంటి ప్రహరీ ధ్వంసం చేశాడు. చేయకపోతే ప్రజలు వత్తిడి, ఎదో ఒక విధంగా చేయాలనే ప్రయత్నం చేస్తుంటే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే తామే బలికావాల్సి వస్తుందని కార్యదర్శులు భయపడుతున్నారు. రోజువారిగా గ్రామాల్లో పంచాయతీ కార్మికులు భయంతో పనులు చేస్తేనే అంతంతమాత్రంగా పనులు సాగుతుంటే రోజు వారి కూలీలను పెడితే వారు బాధ్యతగా రాకపోవడంతో ఖర్చు పెరగడంతోపాటు, పనులు పూర్తి స్థాయిలో సాగట్లేదు.

దినసరి కూలీల అద్దగింత..

కొన్ని పంచాయతీల్లో ప్రజలు ఎదురుక్కొంటున్న సమస్యలను చూసి ఉండలేక పాలకవర్గం రోజు వారి కూలీలతోపాటు, పనులు సాగిస్తున్నారు. దినసరి కూలీలతో పనులు చేయించాలని అధికారులు ఒత్తిడి చేయటంతో పాలకులు, పంచాయతీ కార్యదర్శులు ఈ పనులు చేయిస్తున్నారు. పంచాయతీ యంత్రాంగం తీసుకున్న ప్రత్యామ్నయం ఏర్పాట్లను తెలుసుకుని పంచాయతీ కార్మికులు క్షేత్రస్థాయిలో కూలీలను పనులకు రానీయకుండా అడ్డుకుంటున్నారు. ఇలా సమ్మె నాటి నుంచి పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరా, వీధిలైట్లు, పల్లెపకృతి వనాల పర్యవేక్షణ పలు రకాల సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు.

మావి గొంతెమ్మ కోర్కెలు కాదు



పంచాయతీలో వెట్టి చాకిరి చేస్తున్నాం. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించాం. తాము ఏం పాపం చేశామని ప్రభుత్వం మాపై నిర్లక్ష్యంగా ఉంది. మేము గొంతెమ్మ కోర్కెలు అడగటం లేదు.మా న్యాయమైన కోర్కెలను తీర్చమని అడుగుతున్నాం. ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుంది.

– వంగూరి నాగరాజు, మల్టీపర్పస్ వర్కర్ సంఘం ప్రతినిధి, నేలకొండపల్లి

న్యాయమైన డిమాండ్లతోనే సమ్మె



మా న్యాయమైన సమస్యల పరిష్కారానికే సమ్మెలో దిగాం. రోజంతా కష్ట పడ్డా తమ కుటుంబ గడవడం అష్టకష్టంగా ఉండటంతోపాటు, ఉద్యోగ భద్రత లేక వైద్యం కోసం రక్షణ లేక పోవడం, పీఎఫ్‌లు లేకపోవడం లాంటి ప్రధాన సమస్యలపై పోరుబాట పట్టాం. ప్రభుత్వం తమ కుటుంబాల ఆర్థిక దుస్థితి గమనంలోకి తీసుకోని న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని వేడుకుంటున్నాం.

– పిట్టలమల్లయ్య, సంఘం జిల్లా నాయకుడు

కూలీలతో పనులు సాగిస్తున్నాం



మండలంలోని అన్ని పంచాయతీల్లో కార్మికులు సమ్మెలో ఉండటంతో రోజువారి కూలీలను తీసుకొచ్చి పనులు సాగిస్తున్నాం. రోజు కూలీలతో పనులు చేయించడం ఇబ్బందిగా ఉన్నా శుభ్రత కోసం అవకాశం ఉన్న మేరకు కష్టపడుతున్నాం. రోజు రెండు పంచాయతీల్లో పర్యవేక్షణ చేస్తూ కార్యదర్శిలకు సూచనలు ఇస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మండలపంచాయతీ అధికారి, రఘునాథపాలెం

సమ్మె విరమణే పరిష్కారం



మా గ్రామంలో కార్మికుల సమ్మె కారణంగా చెత్తాచెదారం పేరుకుపోతోంది. రోజు చెత్త తొలగించాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ కార్మికుల డిమాండ్లపై స్పందించి వెంటనే, వారి సమస్యలు పరిష్కరించాలి. ఆ విధంగా చర్యలు తీసుకుని సమ్మెను విరమించేలా చూడాలి. లేకపోతే గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పెరుగుతుంది.

– ఈవూరి సుజాత, సర్పంచ్, చెరువుమాదారం

అర్బన్ తహసీల్దార్‌గా ఎవరు?

ఖమ్మంఅర్బన్: ఇటీవల తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ములుగు జిల్లా నుండి జిల్లాకు విజయ్‌భాస్కర్‌ను కేటాయించగా, ఆయనకు ఖమ్మం అర్బన్ మండలంలో కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చారు. కానీ ములుగు కలెక్టర్ మాత్రం విజయ్‌భాస్కర్‌ను అక్కడే కొనసాగించాలని నిర్ణయించి రిలీవ్ చేయలేదని తెలిసింది. దీంతో గురువారం బాధ్యతలు స్వీకరించాల్సి ఉన్న ఆయన రాకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న శైలజ కొనసాగుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ స్థానంలో ఇంకొకరిని నియమిస్తారని తెలిసింది.

డీవైఎస్‌ఓను కలిసిన యువజన సంఘాలు



సునీల్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి టి.సునీల్‌కుమార్ రెడ్డిని జిల్లాలోని యువజన సంఘాల సమితి బాధ్యులు శుక్రవారం కలిసి సత్కరించారు. నాయకులు జక్కుల వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు ఉమాశంకర్, గోగుల చంద్రశేఖర్, గరిడేపల్లి సత్యనారాయణ, ఉజ్వల, మురళి, అనిల్‌కుమార్, మహేష్, కృష్ణవేణి, లావణ్యలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని త్రీ టౌన్ ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్‌రోడ్డు, వేణుగోపాల్‌నగర్, విజయ్ నగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: భారీ వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెరికసింగారం, జక్కేపల్లి, తుమ్మలతండా, హట్యాతండా ప్రాంతాల్లో ఇసుక మేటలు వేసిన పొలాలను ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. పాలేరు ఏటి పరిధిలో భారీ వరదలకు వందల ఎకరాల్లో వరి పంట నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరదలు తగ్గుముఖం పట్టినా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయలేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. వెంటనే పంటలకు పరిహారం అందించాలని, లేకుంటే ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, నాయకులు మంకెన వాసూ, వనం మధుసూదన్, నాగిరెడ్డి రమేష్‌రెడ్డి, గుగులోత్ లచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ అమలుచేయాలి



మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంరూరల్: ఎస్సీ సబ్‌ప్లాన్ తక్షణమే అమలు చేసి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఆరెంపుల రామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులకు ఇస్తానన్న మూడెకరాల భూమి ఇవ్వకపోగా ఇంకా ఎస్సీల భూములు లాక్కోవడానికి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాపిట్ల శ్రీను, యాకోబు, వి.రవి, కె. భద్రయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగరాజు, శ్రీను, రామయ్య పాల్గొన్నారు.

సోషల్‌మీడియా వేదికగా సమస్యలను గుర్తించాలి

నేలకొండపల్లి: సోషల్ మీడియా వేదికగా సమస్యలు గుర్తించాలని సీపీఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వాలు, నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసినట్లు గా తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మందడపు మురళీ, మారుతి కొండలరావు, శీలం అప్పారావు, ఏటుకూరి రామారావు, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, వివిధ గ్రామాల సోషల్ మీడియా బాధ్యులు పాల్గొన్నారు.

స్వీపర్ల సమ్మెకు మద్దతు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపొంగు మల్లేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు షేక్ ఖాదర్, రాములు, బాబు, గోవర్ధన్‌చారీ, పాల్గొన్నారు.

జీపీఎఫ్ చెల్లింపులో జాప్యం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులో జాప్యాన్ని నివారించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాములు, వీరభద్రం మండల బాధ్యులు సత్యనారాయణ, రవికిషోర్, వీరబాబు, సాధిక్, నర్సింహారావు, వాణిశ్రీ పాల్గొన్నారు.

కామేపల్లి(కారేపల్లి): తెలంగాణ శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను తక్షణమే చేపట్టాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షకార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, పి.రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడగా పోట్ల నాగేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్ నాగిరెడ్డి, కేవీ రమణ, మురళీధర్‌రెడ్డి, గంగ, సునీత, జయవాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

నేలకొండపల్లి: మండలం లోని చెన్నారం గ్రామంలో ఓటు వినియోగంపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీవీప్యాడ్లు, ఈవీఎం ఎలా వినియోగించాలని, ఎలా ఓటు వేయాలని అనే విషయాలపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే స్థానిక బీఎల్‌వో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సింగ్, మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ సెంటర్‌లోని బాలగణపతి ఆలయంలో శుక్రవారం రాత్రి చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తారాదేవి

కామేపల్లి(కారేపల్లి): జూన్ 18, 2023 నాటికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు శనివారంలోపు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.తారాదేవి తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు ఏఈఓలకు తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఏఈఓలు బాణోతు మహేష్, జగదీశ్వర్, ఎస్‌కె.మున్నీ, కిన్నెర ప్రతిభ, వేదిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



కథ చెబుతున్న చిన్నారి

ఖమ్మంగాంధీచౌక్: కథ చెబుతారా! ఊ.. కొడతాం పేరిట తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వివేకానంద విద్యాలయంలో పాఠశాల విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో భక్తి, నీతి కథలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొని నీతి కథలు, భక్తి కథలను వినిపించారు. ఈ కార్యక్రమానికి అనుసంధాన కర్తగా ఖమ్మం టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కో–ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి వ్యవహరించగా బహుమతులను అందించి ప్రోత్సహించారు.

ప్రభుత్వ సాయం అందజేత

ఖమ్మంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంకు చెందిన చిర్రా వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందించే దహన ఖర్చులు రూ.20 వేలును శుక్రవారం తహసీల్దార్ శైలజ అందించారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు, ఆర్‌ఐ రమేష్, రవి తదితరులు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిశీలించాలి



పెన్షన్ దరఖాస్తులపై సిబ్బంది నుండి వివరాలు తెలుసుకుంటున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్ల సమస్యను పరిష్కరించాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కేఎంసీలోని తన చాంబర్‌లో మేయర్ బిల్‌కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకుంటే బిల్ కలెక్టర్‌లు వెంటనే దరఖాస్తుదారుని నివాసం వద్దకు వెళ్లి విచారణ చేసి సకాలంలో రిపోర్ట్‌ను కార్యాలయంలో అందజేయాలన్నారు. కేఎంసీ పరిధిలో 632 పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించాలన్నారు. లబ్ధిదారులకు తక్షణమే పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌ఓ జి.శ్రీనివాస్, బిల్ కలెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ సామాజిక బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న మల్లీశ్వరీ తదితరులు

ఖమ్మంక్రైం: ప్లాస్టిక్ నియంత్రణ ప్రతీ పౌరుని సామాజిక బాధ్యతగా గుర్తించాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బి.మల్లీశ్వరి అన్నారు. శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంపై స్కూల్ చైర్ పర్సన్ హృదయ్‌మీనన్ ఆధ్వర్యంలో అవగాహన పోలీస్‌కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిర్మూలనలో భాగస్వామ్యం అవుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, సీఐ అంజలి, ఆర్‌కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికులు మంత్రి దయాకర్‌రావు ఇంటి ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మండలంలోని వివిధ పంచాయతీ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రెండో ఏఎన్‌ఎంలు..

కూసుమంచి: తమ సమస్యలు పరిష్కరించాలని రెండో ఏఎన్‌ఎంలు అసెంబ్లీ ముట్టడి నిర్వహించనుండగా మండలానికి చెందిన పలువురిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ధనలక్ష్మి, శ్రీలత, అరుణ, సుహాసిని ఉన్నారు.

ముస్లింలపై దాడులు ఆపాలి

ఖమ్మంమయూరిసెంటర్: హర్యానాలో ముస్లింలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని తన్జీమ్ ఇన్సాఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండి.సలాం డిమాండ్ చేశారు. హర్యానాలో ముస్లింలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం నగరంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. హర్యానాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పి, అల్లర్లకు కారణమైన దోషులను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరిశుభ్రత తప్పనిసరి



ఖమ్మం సహకారనగర్: ఐడీఓసీ ఆవరణలో చెత్త తొలగిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ ఒక్కరును పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విపి గౌతమ్ అన్నారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్, ఆర్‌డీఓ ఈఈ శ్యామ్‌ప్రసాద్, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా నగరంలోని 23 వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ షేక్ మక్బూల్ పర్యవేక్షణలో పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్ ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. నిల్వనీరు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ ఉమాదేవి, ఎస్తేరు రాణి, కాషీమూన్, ఆర్పీ మహేశ్వరీ, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఎల్‌పీ రాజు, మున్సిపల్ అకౌంట్ ఆఫీసర్ శివలింగం, నాయకులు ముజ్జు భాయ్, జవాన్ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, కార్యదర్శులు, గ్రామ దీపకలు ఇంటింటికి వెళ్లి నిల్వనీరులేకుండా చేయడంతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



ఖమ్మంమయూరిసెంటర్: దోమల మందు పిచికారీ..



రఘునాథపాలెం: కామంచికల్‌లో..